

నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో బుధవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.800, గరిష్ట ధర రూ.1900, మోడల్ ధర రూ.1200 వరకు పలికింది.



రైల్వే స్టేషన్‌లో వార్షిక తనిఖీలు

విజయవాడ పశ్చిమ : రైల్వే ఏడీజీపీ కుమార్ విశ్వజిత్ బుధవారం విజయవాడలో పర్యటించారు. ముందుగా విజయవాడ రైల్వే ఎస్పీ కార్యాలయాన్ని సందర్శించి వార్షిక తనిఖీలు చేపట్టారు.



జలకాలాటలలో శిక్షణ

వేసవి శిక్షణ శిబిరాలు ఉత్సాహంగా సాగుతున్నాయి. విజయవాడలోని పున్నమీ ఘాట్ సమీపంలో చిన్నారులకు వాటర్ స్పోర్ట్స్‌లో బుధవారం శిక్షణనిచ్చారు.

న్యూస్‌రీల్

న్యాయ సలహా కేంద్రం తనిఖీ

నరసరావుపేట: స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహిస్తున్న న్యాయ సలహా కేంద్రాన్ని అదనపు సీనియర్ సివిల్ న్యాయమూర్తి మధుస్వామి బుధవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఆర్డీవో ఎం.శేషిరెడ్డి, సలహా కేంద్ర న్యాయవాది శ్రీరామినేని ప్రసాదు హాజరయ్యారు.

కొనసాగుతున్న పాలిసెట్ సర్టిఫికెట్ల పరిశీలన



గుంటూరు ఎడ్యుకేషన్: పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశం కోసం ఉద్దేశించిన పాలిసెట్–2023 సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ కొనసాగుతోంది. గుంటూరు నగర శివారు నల్లపాడులోని ఎంబీటీఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ కేంద్రంలో బుధవారం 234 మంది విద్యార్థులు హాజరయ్యారు. హెల్ప్‌లైన్ కేంద్ర సమన్వయకర్త టి.శేఖర్ పర్యవేక్షణలో వివిధ శాఖల అధికారులు పాల్గొని విద్యార్థుల సర్టిఫికెట్లు పరిశీలించారు. గురువారం జరిగే సర్టిఫికెట్ల పరిశీలనకు 43,001 నుంచి 59వేల ర్యాంకు వరకు విద్యార్థులు హాజరు కావాల్సి ఉంది.

డ్రై,లిక్విడ్ గంజాయిని నిర్వీర్యం చేయాలి



నగరంపాలెం(గుంటూరు వెస్ట్): స్వాధీనం చేసుకున్న గంజాయిని త్వరగా నిర్వీర్యం చేయాలని ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్ ఆదేశించారు. మంగళగిరి రూరల్, పట్టాభిపురం, పొన్నూరు పోలీస్‌స్టేషన్ల (పీఎస్) పరిధిలో సీజ్ చేసిన డ్రై, లిక్విడ్ గంజాయిని బుధవారం పోలీస్‌పెరేడ్ గ్రౌండ్‌కు తరలించగా ఎస్పీ పరిశీలించారు. జిల్లా డ్రగ్స్ డిస్పోజల్ కంట్రోల్ కమిటీ చైర్మన్ హోదాలో కమిటీ సభ్యుల సమక్షంలో ఎలక్ట్రానిక్ పరికరంతో పరిశీలించారు. కొద్ది రోజులుగా ఆయా పీఎస్‌ల పరిధిలో స్వాధీనం చేసుకున్న సుమారు 476 కిలోల డ్రై/లిక్విడ్ గంజాయిని పద్ధతి ప్రకారం డిస్పోజల్ చేయాలని అధికారులను ఎస్పీ ఆదేశించారు. ఏఎస్పీ (క్రైం) శ్రీనివాసరావు, డీసీఆర్‌బీ డీఎస్పీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలకు విస్తృత ఏర్పాట్లు

గుంటూరు ఎడ్యుకేషన్: ఈనెల రెండో తేదీ నుంచి జరగనున్న టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు గుంటూరు జిల్లా వ్యాప్తంగా 27 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు డీఈఓ పి.శైలజ బుధవారం తెలిపారు. ఈనెల 10న జరగనున్న పరీక్షలకు 5,422 మంది విద్యార్థులు దరఖాస్తు చేసినట్లు వివరించారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 వరకు పరీక్షలు జరగనుండగా, విద్యార్థులను ఉదయం 8.45 నుంచి 9.30 గంటలోపే అనుమతిస్తామని స్పష్టం చేశారు. హాల్ టికెట్, పెన్ను మినహా మరే ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించబోమని చెప్పారు. పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ సహా పరీక్షల విధుల్లో ఉన్న అధికారులు, ఉద్యోగులు సెల్‌ఫోన్లు తీసుకొచ్చేందుకు అనుమతి లేదని స్పష్టం చేశారు.

రత్నగిరి కాలనీలో జింక గుర్తింపు

నగరంపాలెం(గుంటూరువెస్ట్): గుంటూరు రూరల్ మండల పరిధిలోని రత్నగిరికాలనీ సమీపంలోని పొలాల్లో బుధవారం అటవీ శాఖ అధికారులు జింకను పట్టుకున్నారు. స్ట్రైకింగ్ ఫోర్స్ సభ్యులు సతీష్ కుమార్, అబ్దుల్‌రహీంతోపాటు స్థానికులు సహాయంతో జింకను పట్టుకుని ప్రథమ చికిత్స అందించారు. అనంతరం పల్నాడు జిల్లా నరసరావుపేట సమీపంలోని అటవీ ప్రాంతంలో వదిలేశారు. అమరావతి మండలం లేమల్లె అటవీ ప్రాంతం నుంచి నీటి కోసం జింక వచ్చి ఉంటుందని ఆ శాఖ అధికారి సంతోష్‌కుమార్ తెలిపారు. వేసవి దృష్ట్యా దాహార్తి కోసం దారి తప్పి వచ్చే అటవీ జంతువులు కనిపిస్తే తెలియజేయాలని కోరారు.

తనిఖీల్లో 23 కేసులు

పట్నంబజారు(గుంటూరు): రవాణా శాఖ అధికారుల ఆధ్వర్యంలో బుధవారం గుంటూరు జిల్లాలో మిషన్‌లైఫ్ కార్యక్రమంలో భాగంగా వాహన కాలుష్యంపై తనిఖీలు జరిగాయి. 23 కేసులు నమోదు చేశారు. కార్యక్రమంలో ఎంవీఐ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

కిలహాల నవ్వులు

రైతు భరోసా.. సేద్యం కులాసా

- కర్షకులను ఏటా ఆదుకుంటున్న వైఎస్ జగన్ ప్రభుత్వం
- నేడు అట్టహాసంగా నగదు జమ
- 1,16,700 కుటుంబాలకు లబ్ధి
- రూ.87.53 కోట్ల మేర ప్రయోజనం
- ఐదో విడత సేద్యానికి వెన్నుదన్ను
- 2,087 మంది రైతులకు రూ.1.35 కోట్లు ఇన్‌ఫుట్ సబ్సిడీ




సేద్యమేవ జయతే : వరి నారు తీస్తున్న కూలీలు (పాతచిత్రం)

సాక్షి ప్రతినిధి, గుంటూరు: సేద్యం సుభిక్షమవుతోంది. రైతు ఇంట సంక్షేమ సిరులు కురుస్తున్నాయి. వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టిన నాటి నుంచి కర్షకులకు వెన్నుదన్నుగా నిలుస్తోంది. రైతుభరోసా–పీఎం కిసాన్ పథకం ద్వారా ఏడాదికి రూ.13,500 చొప్పున పెట్టుబడి సాయం అందించడమే కాకకుండా ఆర్‌బీకేలను ఏర్పాటు చేసి విత్తు నుంచి పంట విక్రయాల వరకు అండగా నిలుస్తోంది. గిట్టుబాటు ధర కల్పిస్తోంది. విపత్తులు సంభవించినప్పుడు పంట నష్టపోతే పరిహారం అందజేస్తోంది. ఆరుగాలం రైతుకు సూచనలు, సలహాలు అందిస్తోంది. ఉచిత బీమా పథకం అమలు చేస్తోంది. సూక్ష్మ సేద్య పరికరాలు అందజేస్తోంది. తాజాగా వరుసగా ఐదో విడత రైతు భరోసా సాయం అందించేందుకు జన హృదయ విజేత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంసిద్ధులవుతున్నారు. గురువారం నగదు జమను ఆయన అట్టహాసంగా కర్నూలు జిల్లా పత్తికొండ నుంచి ప్రారంభించనున్నారు.

సీజన్‌కు ముందే

ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే కర్షకులకు ప్రభుత్వం పెట్టుబడి సాయం అందిస్తోంది. పెట్టుబడి కోసం రైతులు ఎవరి దగ్గర అర్రులు చాచకుండా చర్యలు చేపట్టింది. గత నాలుగేళ్లుగా ఇదే తరహాలో సాయం అందిస్తోంది. ఈ ఏడాది నగదు జమకు కర్నూలు జిల్లా పత్తికొండ వేదికవుతోంది.



గత నాలుగేళ్లలో రైతుభరోసా-పీఎం కిసాన్ లబ్ధి ఇలా..

సంవత్సరం	లబ్ధిదారుల సంఖ్య	జమైన నగదు (రూ.కోట్లలో)
2019–20	1,21,888	164.55
2020–21	1,25,894	169.96
2021–22	1,15,083	155.36
2022–23	1,20,689	162.93

దీనికి అన్ని ఏర్పాట్లూ పూర్తయ్యాయి. గుంటూరు జిల్లాలోని 1,16,700 మంది రైతుల ఖాతాల్లో రైతు భరోసా–పీఎం కిసాన్ ద్వారా రూ.87.53 కోట్లు గురువారం జమ కానుంది. అంతేకాకుండా ఇటీవల కురిసిన అకాల వర్షాలకు పంటలు దెబ్బతిన్న 2,087 మంది రైతులకు రూ.1.35 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీ కూడా జమ కానుంది.

కౌలు రైతులకు సాయం

పొలాలు కౌలుకు చేసుకుని బతుకుబండి సాగిస్తున్న రైతులకూ ప్రభుత్వం రైతు భరోసా పథకాన్ని వర్తింపజేసింది. జిల్లా వ్యాప్తంగా 5,800 మంది కౌలు రైతులకు రూ.4.35 కోట్ల నగదు ఖాతాల్లో జమ కానుంది. భూ యజమానికి ఎలాంటి ఇబ్బంది లేకుండా వారి హక్కులకు భంగం వాటిల్లకుండా నగదు అందజేసే ప్రక్రియకు నాంది పలకడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. డీకే పట్టాలతో సాగు చేసుకుంటున్న వారికీ ఈ పథకం వర్తింపజేశారు.

రైతు బాంధవుడు



ప్రభుత్వం రైతుభరోసా పథకం ద్వారా ఇప్పటికే నాలుగు సార్లు నేరుగా బ్యాంకు ఖాతాలో డబ్బులు జమ చేసింది. అవి పంటలకు ఎరువులు, పురుగుమందులు కొనుగోలు చేసేందుకు ఉపయోగపడ్డాయి. రుణమాఫీ చేస్తానని గత ప్రభుత్వం హామీ ఇచ్చి మాట తప్పింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు బాంధవుడు. పంట నష్టపరిహారం వెంటనే అందజేస్తున్నారు. ఆయన మేలు మరిచిపోలేం.

– కళ్యాణం వీరరాఘవయ్య, ఉప్పలపాడు

సేద్యానికి దన్ను



ప్రభుత్వం సేద్యానికి దన్నుగా నిలుస్తోంది. దీనిలో భాగంగానే రైతుభరోసా–పీఎం కిసాన్ నగదు గురువారం రైతుల ఖాతాలో జమకానుంది. గుంటూరు జిల్లాలోని 1,16,700 మంది రైతు కుటుంబాలకు మేలు కలుగుతుంది. ఇటీవల అకాల వర్షాలకు పంట నష్టపోయిన 2,087 మంది రైతులకు రూ.1.35 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీ రైతుల ఖాతాల్లో జమ అవుతుంది. త్వరలో 5,800 మంది కౌలు రైతులకు రైతుభరోసా సాయం రూ.4.35 కోట్లు లబ్ధి చేకూరుతుంది.

– నున్న వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయ అధికారి, గుంటూరు

నాలుగేళ్ల నుంచి రైతుభరోసా వస్తోంది



వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కౌలు రైతు కార్డు ద్వారా రైతు భరోసా వస్తోంది. అధిక వర్షాల పంట దెబ్బతింటే నష్ట పరిహారమూ అందుతోంది. సబ్సిడీపై ఎరువులు, పురుగు మందులు అందుతున్నాయి. బ్యాంకు రుణాలు అందిస్తున్నారు. గత ప్రభుత్వంలో కౌలురైతులకు ఇలాంటివేమీ అందేవి కావు. ఈ ప్రభుత్వం చల్లగుండాల. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు

– బొడ్డు నాగరాజు, కౌలు రైతు, కొల్లిపర

ఆపద్బాంధవులు

అలల తాకిడికి కొట్టుకుపోతున్న ఇద్దరు బాలికలను రక్షించిన పోలీసులు



బాపట్ల టౌన్: సూర్యలంక సముద్రతీరంలో అలల తాకిడికి కొట్టుకుపోతున్న ఇద్దరు బాలికలను పోలీసులు బుధవారం కాపాడారు. పొన్నూరుకు చెందిన కుంచాల క్రాంతిమయి, సుద్దపల్లి మాలతి సముద్రస్నానానికి వచ్చి అలల ఉధృతిలో చిక్కుకున్నారు. కొట్టుకుపోతున్న వారిని గమనించిన హెడ్‌కానిస్టేబుల్ ఎం.పోతురాజు, కానిస్టేబుల్ నాగరాజు, హోంగార్డులు ఎన్.శ్రీనివాసరావు, గజ ఈతగాళ్ళు సంగాని సురేష్, కొక్కిలిగడ్డ మస్తాన్ కాపాడారు. చికిత్స నిమిత్తం ఏరియా వైద్యశాలకు పంపారు. బాలికలను కాపాడిన పోలీసు సిబ్బందిని ఎస్పీ వకుల్ జిందాల్ అభినందించారు. సముద్రస్నానాలకు వచ్చే పర్యాటకులు లోతుకు వెళ్ళొద్దని ఎస్పీ వకుల్ జిందాల్ హెచ్చరించారు.

9వ తరగతి విద్యార్థినికి వేధింపులు

బైక్ మెకానిక్‌పై పోక్సో కేసు

తాడేపల్లిరూరల్ : మంగళగిరి–తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని వడ్డేశ్వరంలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థినిని ఓ బైక్ మెకానిక్ వెంబడించి వేధించాడు. ఈ ఘటనపై తాడేపల్లి పోలీసులు బుధవారం పోక్సో కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారు. ఎస్ఐ రమేష్ కథనం ప్రకారం.. కాకుమాను ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటూ హాస్టల్‌లో నివాసం ఉండే 9వ తరగతి విద్యార్థిని సెలవుల సందర్భంగా వడ్డేశ్వరంలో ఉన్న తల్లిదండ్రుల వద్దకు వచ్చింది. ఇంటిపక్కనే ఉంటున్న బైక్ మెకానిక్ అమృత్ కుమార్ తరచూ బాలికను ప్రేమిస్తున్నానంటూ వేధింపులకు గురిచేస్తున్నాడు. ఆ బాలిక తల్లిదండ్రుల సహాయంతో ఫిర్యాదు చేయడంతో అమృత్‌కుమార్‌పై పోక్సో చట్టం ద్వారా కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు పోలీసులు వివరించారు.

స్వల్పంగా రిజిస్ట్రేషన్ చార్జీలు పెంపు

- నేటి నుంచి అమలు
- 80 శాతం గ్రామాల్లో, శివారు ప్రాంతాల్లో పెంపుదల లేదు



గుంటూరు రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వచ్చిన క్రయవిక్రేతలు

గుంటూరు వెస్ట్: స్టాంపులు రిజిస్ట్రేషన్ శాఖ స్వల్పంగా చార్జీలు పెంచింది. కొన్ని ప్రాంతాల్లో 10 నుంచి 20 శాతం పెరగగా జిల్లాలోని 80 శాతం గ్రామాల్లో, నగర శివారు ప్రాంతాల్లో అస్సలు రూపాయి కూడా పెంచలేదు. దీంతో రైతులకు భారీ ఊరట కాగా, మధ్యతరగతి ప్రజలు అధికంగా కొనుగోలు చేసే శివారు ప్రాంత ప్లాట్లకు పెరిగిన చార్జీలు వర్తించవు. జిల్లాకు ఏడాదికి సుమారు రూ.700 కోట్ల ఆదాయం ఈ శాఖ నుంచే వస్తుంది. ముఖ్యంగా 2019 నుంచి ఇప్పటి వరకు చాలా స్వల్పంగానే ప్రభుత్వం రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచింది. 2021లో అస్సలు పెంచలేదు. సామాన్యులపై భారం పడకుండా చూడాలని ఇటీవల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన ఆదేశాల మేరకు చార్జీలు వీలైనంత తగ్గించే క్రమంలో గత నెల రోజుల నుంచి స్టాంపులు రిజిస్ట్రేషన్ శాఖ డిఐజీ జి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మార్కెట్ వాల్యూ రివిజన్‌ను నిర్వహించారు. ఈ క్రమంలోనే కొన్ని గ్రామాల్లోనే ధరలు స్వల్పంగా పెంచాలని నిర్ణయానికి వచ్చారు. 2014 నుంచి 2019 వరకు టీడీపీ ప్రభుత్వంలో 25 శాతం నుంచి 200 శాతానికి పెంచిన సందర్భాలు అనేకం ఉన్నాయి. స్వల్పంగా పెరిగిన చార్జీలు జూన్ 1 నుంచి అమలులోకి రానున్నాయి.

పెరిగిన ధరలు సుమారుగా

జూన్ 1 నుంచి అమలులోకి రానున్న పెరిగిన రిజిస్ట్రేషన్ చార్జీల ధరలు ఎలా ఉన్నాయంటే బ్రాడీపేటలో చదరపు గజం రూ.32 వేలు ఉంటే అది రూ.36 వేలుకు, పాత గుంటూరులో చ.గ. 20 వేలుంటే అది రూ.24 వేలుకు, వసంతరాయపురంలో రూ.14 వేలుంటే, రూ.16 వేలుకు, అరండల్‌పేటలో చ.గ. రూ.45 వేలుంటే రూ.51 వేలకు పెరిగాయి. ఇక గ్రామాల్లోకి వస్తే బుడంపాడులో ఎకరా రూ.25 లక్షలు ఉంటే అది రూ.28 లక్షలకు, ఏటుకూరులో రూ.40 లక్షలుంటే అది రూ.43 లక్షలకు, అనంతవరప్పాడులో రూ.21 లక్షలుంటే అది రూ.22 లక్షలకు పెరిగాయి. ఇక ప్రధాన రహదారులకు అటు ఇటు, ఇన్నర్ రింగ్ రోడ్డులో కాస్త పెంచారు. నిర్మాణాలకు వస్తే అపార్ట్‌మెంట్ చదరపు అడుగుకు రూ.3,000 ఉన్న చోట కేవలం రూ.100 నుంచి రూ.200 వరకు పెరిగాయి. అవి కూడా శివారు ప్రాంతాలకు వర్తించవు.

ఊపందుకున్న రిజిస్ట్రేషన్లు

కొందరు దళారులు ధరలు భారీగా పెరుగుతాయనే పుకార్లు సృష్టించడంతో జిల్లాలోని 34 సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో బుధవారం రిజిస్ట్రేషన్లు ఊపందుకున్నాయి. దీంతోపాటు సోమ, మంగళవారాల్లో స్వల్పంగా సర్వర్ డౌన్ కావడంతో ఆగినవి కూడా వచ్చాయి. ఉదయం నుంచే కక్షిదారులు ఎస్ఆర్ఓ కార్యాలయాలకు చేరుకున్నారు. అయితే ధరలు పెద్దగా పెరగలేదని తెలుసుకున్న మరికొందరు రిజిస్ట్రేషన్లు తర్వాత చేయించుకుందామని వెనుదిరిగారు.

పెద్ద మార్పు ఏమీలేదు



శివారు ప్రాంతంలో కొన్ని ప్లాటు రిజిస్ట్రేషన్‌కు వచ్చాం. ధరలు భారీగా పెరిగిపోతాయనుకున్నాము. అయితే శివారు ప్రాంతాల్లో 90 శాతం ధరలు పెంచలేదు. మేము కొన్న స్థలానికీ మార్కెట్ వాల్యూలో మార్పులేదు. అందుకే వచ్చే వారం చేయించుకుంటాం. గత నాలుగేళ్లలో రిజిస్ట్రేషన్ల భారం పెద్దగా పడలేదని చెప్పవచ్చు.

– బి.పిచ్చయ్య, గుంటూరు

మౌలిక సదుపాయాలు కల్పించాలి



రిజిస్ట్రేషన్‌కు వచ్చాం. నేను పాత మార్కెట్ వాల్యూలోనే చేయించుకుంటున్నాను. నేను కొన్న ఆస్తిపై గురువారం నుంచి కేవలం 10 శాతమే పెరిగింది. ఎస్ఆర్ఓ కార్యాలయాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి. గుంటూరు ఎస్ఆర్ఓ 1872 నుంచి ఇక్కడే ఉంది. మహిళలకు వాష్‌రూమ్స్‌లేవు. కొన్ని సార్లు సర్వర్లు మొరాయిస్తే ఎక్కువ సమయం పడుతుంది.

– తోట నరసింహారావు, గుంటూరు

చాలా స్వల్పంగానే ధరలు పెరిగాయి



రాష్ట్ర ప్రభుత్వం, ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ఆదేశాల నేపథ్యంలోనే 80 శాతం గ్రామాల్లోనూ, పట్టణ శివారు ప్రాంతాల్లోనూ ధరలు అస్సలు పెంచలేదు. పెంచినవీ నామమాత్రంగానే ఉన్నాయి. ప్రజలపై భారం పడకుండా జాగ్రత్తపడ్డాం. ముఖ్యంగా గడచిన నాలుగేళ్ళలో చార్జీల పెరుగుదల స్వల్పంగానే ఉంది.

– జి.శ్రీనివాసరావు, డిఐజీ, స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ, గుంటూరు జిల్లా

వైభవంగా గోపీనాథస్వామి ఆలయ పునఃప్రతిష్ఠ



విమాన శిఖర కలశాలకు పూజలు నిర్వహిస్తున్న మంత్రి విడదల రజిని, కుమారస్వామి దంపతులు

చిలకలూరిపేట: పురుషోత్తమపట్నంలో రుక్మిణీ సత్యభామ సమేత గోపీనాథస్వామి ఆలయ పునఃప్రతిష్ఠా మహోత్సవం బుధవారం నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధ్వజస్తంభ ప్రతిష్ఠ, విమాన శిఖరస్థాపన జరిపించారు. స్వామికి ప్రాణప్రతిష్ఠ, జీవకళాన్యాసం, ప్రత్యేక అలంకరణ, స్వామి దర్శనం ఏర్పాటు చేశారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని సహకారంతో దేవదాయ, టీటీడీ నిధులతో నిర్వహించిన పునఃప్రతిష్ఠా మహోత్సవంలో మంత్రితోపాటు ఆమె కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. భక్తులు భారీగా తరలి వచ్చారు. అనంతరం భారీ అన్నదానం జరిగింది. కార్యక్రమంలో మంత్రి కుటుంబ సభ్యులు విడదల లక్ష్మీనారాయణ, విడదల కుమారస్వామి, విడదల గోపీనాథ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్, రామచంద్రప్రసాద్ పాల్గొన్నారు.

జగనన్న వచ్చిన తర్వాతే
మాకు భరోసా

- వలంటీర్ల వల్లే మా జీవితాలకు గుర్తింపు
- ఇప్పుడు మాకు సొంత స్థలం కూడా వచ్చింది
- ఇళ్లూ కట్టిస్తామంటున్నారు
- కాగితాలు ఏరుకుని జీవించే కటిక పేదల ఆనందం



ఎమ్మెల్యే ఆర్కేతో కలిసి ఆనందం వ్యక్తం చేస్తున్న చిత్తుకాగితాలు ఏరుకునే కటిక పేదలు

తాడేపల్లిరూరల్ : "గతంలో ఏ ప్రభుత్వం వచ్చినా, ఏ అధికారి పర్యటించినా మొట్టమొదటగా మా గుడిసెలనే తొలగించేవాళ్లు. అప్పటికప్పుడు తట్టాబుట్టా సర్దుకుని ఖాళీ స్థలం ఎక్కడుందో చూసుకుని పాకలు వేసుకునేవాళ్లం. అలాంటిది జగనన్న ప్రభుత్వం వచ్చిన తరువాత మాకు భరోసా లభించింది. వలంటీర్ల ద్వారా ఆధార్ కార్డు, రేషన్ కార్డు వచ్చాయి. ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా డబ్బులు అందుతున్నాయి. జగనన్నతోనే మా బతుకుల్లో మార్పులు వచ్చాయి" అంటూ రోడ్ల వెంబడి చిత్తు కాగితాలు ఏరుకుని అమ్ముకుని జీవించే కటిక పేదలు జగనన్నకు జేజేలు పలికారు. బుధవారం తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం, మెల్లెంపూడి ప్రాంతాల లబ్ధిదారులకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) ఇళ్లస్థల పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు భావోద్వేగానికి లోనయ్యారు. ఆనందబాష్పాలతో ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి వద్ద సంతోషం వ్యక్తం చేశారు. గతంలో పడిన కష్టాలను వివరించారు.

చాలా చోట్లకు మారాం..

"2014లో కృష్ణా నది ఒడ్డున నివాస ఉండేవాళ్లం. అప్పట్లో గుళ్లకు సంబంధించిన అధికారులు వచ్చి గుడి ముందు మీ ఇళ్లేంటంటూ తొలగించారు. ఆ తరువాత రైల్వే బ్రిడ్జి కింద పుష్కర ఘాట్ల వద్ద గుడిసెలు వేసుకున్నాం. పుష్కరాల పేరుతో వాటినీ తొలగించారు. అనంతరం కొలనుకొండ దగ్గర రోడ్డు వెంబడి గుడిసెల వేసుకుని ఉంటుంటే అక్కడా తీయించేశారు. వడ్డేశ్వరంలో రైల్వే ట్రాక్ దగ్గరకు మారగా, పోలీసులను తీసుకువచ్చి ఖాళీ చేయించారు. అట్లా మరో రెండు చోట్ల మారిన తరువాత జగనన్న ప్రభుత్వం వచ్చింది. తమ నివాసాలు తొలగిస్తుంటే అక్కడి వలంటీర్ సమస్యను తహసీల్దార్ దృష్టికి తీసుకువెళ్లారు. ఇప్పటంలో తాత్కాలికంగా చోటు చూపించారు. అక్కడే నివాసం ఉంటున్నాం. వలంటీర్లు మా ఇంటి చుట్టూ తిరిగి మా పిల్లలను బడిలో చేర్పించి, ఆధార్‌కార్డులు, రేషన్ కార్డులు ఇప్పించి నెలనెలా రేషన్ ఇప్పిస్తున్నారు. మా అందరికీ ఇప్పుడు అమ్మఒడి కూడా వస్తోంది. మేము పుట్టిబుద్ధి ఎరిగిన తర్వాత ఏ ప్రభుత్వంలోనూ మాకు గౌరవం దక్కలేదు. జగనన్న ప్రభుత్వమే అక్కున చేర్చుకుంది. మాకు ఇప్పుడు ఓటు హక్కు కూడా ఉంది. జగనన్న పుణ్యమా అంటూ మాకు ఇంటి స్థలం కూడా వచ్చింది. జగనన్న మాకు ఇంటిని నిర్మించి ఇస్తే మా పిల్లలకు పూర్తి భరోసా ఉంటుందని" అని సంతోషం వెలిబుచ్చారు.

మా పిల్లలు బడికి వెళ్తున్నారు



జగనన్న ప్రభుత్వం వచ్చిన తరువాత మా పిల్లలు బడికి వెళుతున్నారు. వలంటీర్లు మా ఇంటికే వచ్చి అన్ని పథకాలూ అందజేస్తున్నారు. రేషన్ ఇప్పిస్తున్నారు. ఇప్పుడు స్థలం ఇచ్చారు. చాలా ఆనందంగా ఉంది.

– యాటగిరి తిరుపతమ్మ, వడ్డేశ్వరం

మా జీవితాల్లో ఎంతో మార్పు



నాకు ఇద్దరు పిల్లలు. చిత్తు పేపర్లు ఏరుకుని బతుకుతున్నాం. జగనన్న ప్రభుత్వం వచ్చిన తరువాత మా ఇద్దరు పిల్లల్ని స్కూల్‌కు పంపిస్తున్నాం. మాకు అమ్మఒడి కూడా వచ్చింది. మా పిల్లలు ఇద్దరూ రెండో క్లాసు, 4వ క్లాసు చదువుతున్నారు. మాకు ఎంతో ఆనందంగా ఉంది. జగనన్న దయతో ఇంటి స్థలం వచ్చింది. త్వరలో ఇల్లు కట్టుకుంటాం. మా జీవితాల్లో ఎంతో మార్పు వచ్చింది.

రసిగిరి మీనమ్మ, వడ్డేశ్వరం

కలగా ఉంది.



మేము ఎక్కడ గుడిసె వేసుకుని ఉంటున్నా మమ్మల్ని అంటరానివారిగా చూసేవాళ్లు. జగనన్న ప్రభుత్వం వచ్చిన తరువాత మా బతుకుల్లో మార్పులు వచ్చాయి. ఇదంతా కలగా ఉంది. ఈ ప్రభుత్వం సమాజంలో మమ్మల్ని కూడా గుర్తించింది. అందరితో పాటు మాకు కూడా ఇంటి స్థలం ఇవ్వడం ఆనందంగా ఉంది.

– ఎకవేరి హరికృష్ణ, వడ్డేశ్వరం

సొంత ఇల్లు లేని పేదల కష్టాలు వర్ణనాతీతం

- ఇల్లు లేని నిరుపేదల కష్టాలు వింటుంటే కళ్లుచెమ్మగిల్లుతున్నాయి
- ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డితో వారి కష్టాలు తీరాయి
- నెలరోజుల వ్యవధిలోనే ఇంటి నిర్మాణ పనులు ప్రారంభం
- మంగళగిరిఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)


కృష్ణాయపాలెంలో వడ్డేశ్వరం పేదలకు ఇంటి పట్టాలు అందజేస్తున్న మంగళగిరి శాసనసభ్యులు ఆర్కే

తాడేపల్లిరూరల్: సొంతిల్లు లేని పేదల కష్టాలు వర్ణనాతీతం. గతంలో వారి కష్టాల గురించి ఏదో ఒకచోట ఎవరో ఒకరు చెబుతూ ఉండేవారు. పట్టాలు పంచేటప్పుడు వారు పడ్డ కష్టాలు వింటుంటే కళ్లు చెమ్మగిల్లుతున్నాయని మంగళగిరి శాసనసభ్యులు ఆళ్ల రామకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి రూరల్ వడ్డేశ్వరం, మెల్లెంపూడి ప్రాంతాలకు చెందిన ఇళ్లులేని పేదలకు సీఆర్‌డీఏ పరిధిలోని కృష్ణాయపాలెంలో ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ఆర్కే, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, తాడేపల్లి తహసీల్దార్ నాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ పట్టాలు పంచుతున్న సమయంలో అద్దె ఇళ్లల్లో కాలవగట్ల మీద నివాసాలు ఏర్పచుకుని జీవిస్తున్న మహిళలు తమ ఆవేదనను వెలిబుచ్చారు. అద్దె ఇంట్లో నివాసముండే సమయంలో ఇంట్లో ఎవరైనా పెద్దవారు, ప్రమాదవశాత్తు ఎవరైనా మరణించినా వారు అద్దెకు నివాసముంటున్న ఇంటికి మృతదేహాన్ని తీసుకు రానిచ్చేవారు కాదని, ఎక్కడో రోడ్లమీద మృతదేహాన్ని ఉంచి అంత్యక్రియలు నిర్వహించి కర్మకాండలు చేసేదాకా ఇంటికి రాకుండా సుదూర ప్రాంతాల్లో ఉన్న సత్రాల్లో బిక్కుబిక్కుమంటూ ఉండేవాళ్లమని, కాలవగట్ల మీద, చెరువు కట్ల మీద నివాసం ఉండేటప్పుడు ప్రతిసారీ ఇళ్లు తొలగిస్తామని సంబంధిత అధికారులు నోటీసులిచ్చేవారని, ఆందోళనలో ఎక్కడకు వెళ్లాలో తెలియక బిక్కుబిక్కు మంటూ బతికేవారమని వారు ఆవేదన వ్యక్తం చేశారన్నారు. జగనన్న ప్రభుత్వం వచ్చిన తరువాత మాకు భరోసా లభించిందని, మాసొంత ఇంటి కల నెరవేరుతోందని వారు అన్నారని అన్నారు. సీఆర్‌డీఏ పరిధిలో మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలో పేదలకు కేటాయించిన ఇళ్ల స్థలాల్లో ఇంటి నిర్మాణ పనులు చేపడతామని, ఆ లోపు ఇంటి నిర్మాణానికి కావలసిన అన్ని మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయనున్నట్లు ఆయన స్పష్టం చేశారు.

జగనన్నకే తప్ప వేరెవరికీ ఓటేయను



నాకు ఓటు హక్కు వచ్చిన తరువాత ఇప్పటి వరకు టీడీపీకే ఓటేశా. చంద్రబాబు నాయుడు హయాంలో మా కుటుంబానికి ఎటువంటి మేలు జరగలేదు. ఎన్టీఆర్ అభిమానం మీద ఆయనకు ఓటు వేస్తున్నాం. జగన్‌బాబు ప్రభుత్వం వచ్చిన తరువాత మా కుటుంబం అన్ని విధాలా లబ్ధి పొందింది. ఇల్లు లేని లోటు కూడా ఈ ప్రభుత్వంలోనే తీరింది. గతంలో ఇంటి కోసం టీడీపీ నాయకుల చుట్టూ తిరిగా. ఇప్పుడు ఏ నాయకుడి దగ్గరకు వెళ్లకుండానే నాకు ఇల్లు వచ్చింది. బతికున్నంత కాలం జగన్‌కు తప్ప ఎవరికీ ఓటు వేయను.

–సంపతి కామాక్షమ్మ, మెల్లెంపూడి

నాకు ఊహ తెలిసి సొంతిల్లు లేదు



నాకు ఊహ వచ్చినప్పటి నుంచి మా అమ్మా నాన్నకు ఇల్లు లేదు. మా అత్తా మామలకు ఇల్లులేదు. నా భర్తకూ ఇల్లు లేదు. ఇప్పుడు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పుణ్యమాని నాకు ఇంటి స్థలం వచ్చింది. ప్రభుత్వమే ఇల్లు కూడా నిర్మించి ఇస్తానంది. నేను చీపుర్లు అమ్ముకుని జీవిస్తున్నా. నాకు సొంత ఇల్లు ఉంటే ఒంటరిగా ఉన్న నా జీవితానికి భరోసా లభిస్తుంది. తిన్నా తినకపోయినా సొంత ఇంట్లో ఉండొచ్చు. ఎమ్మెల్యే ఆర్కే ప్రభుత్వమే ఇళ్లు నిర్మిస్తుందని నాకు చెప్పారు. నా సొంత ఇంట్లోనే నేను కన్ను మూయాలి.

–కాటమ్మ, వడ్డేశ్వరం

ఎంతో మందిని అభ్యర్థించా



మా కుటుంబానికి ఇల్లు లేకపోవడం, అద్దెలు కట్టలేకపోవడంతో ఏ పార్టీవారు మీటింగ్‌కు పిలిచినా ఇంటి స్థలం ఇస్తారనే ఆశతో వెళ్లేవాళ్లం. జగనన్న ప్రభుత్వం వచ్చిన తరువాత మేం ఎక్కడికీ వెళ్లకుండానే, ఎవరి చుట్టూ తిరగకుండానే మాకు ఇళ్లు కేటాయించారు. మళ్లీ జగన్ ముఖ్యమంత్రి అయితే మా జీవితాల్లో మార్పు వస్తుంది.

– కామాక్షమ్మ, వడ్డేశ్వరం

ఇళ్ల స్థలం మాకు వరం



జగనన్న ఇచ్చిన ఈ ఇళ్ల స్థలం మాకు వరం. మా పెళ్లయిన దగ్గర నుంచి అద్దె ఇళ్లల్లోనే నివాసముంటున్నాం. ఇక్కడ చిన్న పొరపాటు జరిగినా ఇంటి యజమానులు ఇళ్లు ఖాళీ చేయమనే వారు. కూలీ పని చేసుకునే మాకు రెండు వేలు కట్టడమే చాలా ఇబ్బందిగా ఉండేది. ఇంటి స్థలం కేటాయించడంతో పాటు ఇల్లు కట్టుకునేందుకు కూడా డబ్బులు ఇస్తున్నారు. మేము త్వరలోనే మా ఇంట్లో నివాసముంటాం.

–బత్తుల చంద్రమ్మ, వడ్డేశ్వరం

క్రీడా స్ఫూర్తి నింపిన శిక్షణ

- ఉత్సాహంగా పాల్గొన్న 120 మంది చిన్నారులు
- క్రేజీ క్రికెట్‌కు అపూర్వ ఆదరణ
- చాలా నేర్చుకున్నామంటున్న చిన్నారులు
- పిల్లల్ని ప్రోత్సహించాలన్న ప్రముఖులు

ఆటలంటే ఆబాలగోపాలనికి మక్కువే. సెల్‌ఫోన్‌లో గేములు ఎన్ని ఆడుకున్నా క్రీడా మైదానంలో అడుగుపెట్టి.. మిత్రులతో కలసి ఆడే ఆటలు చిరంతరం గుర్తుండిపోతాయి. అందునా సెలవుల రోజులు.. మిత్రులతో కలసి క్రికెట్ ఆట ఆడేందుకు ఎవరైనా బ్యాటు, వికెట్లు పట్టుకుని పరుగులు పెడతారు. అలాంటి ఆటలో ఆరితేరి, మేలకువలు నేర్చుకుని.. పూర్తిగా తర్ఫీదు పొందారు గుంటూరులోని పలువురు చిన్నారులు. సమ్మర్ కోచింగ్ పేరిట ఏసీఏ సారథ్యంలో జరిగిన ఈ శిక్షణ చిన్నారుల్లో క్రీడాస్ఫూర్తిని రగిలించింది.

గుంటూరు వెస్ట్ (క్రీడలు): మన దేశంలో క్రికెట్‌కున్న క్రేజ్ అంతా ఇంతా కాదు. మ్యాచ్ ఉందంటే చాలు పిల్లల దగ్గర నుంచి పెద్దల వరకు టీవీలకు అతుక్కుపోవడం పరిపాటి. ఏడాది పొడవునా చదువుకుంటూ సెలవుల మాసం మే నెలలో క్రికెట్ సమ్మర్ కోచింగ్ క్యాంప్ ప్రారంభమైందంటే ఇక పిల్లలు ఊరుకుంటారా... అందుకే ఏసీఏ సారథ్యంలో జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో నెల రోజుల నుంచి ఉచితంగా స్థానిక అరండల్‌పేటలోని పిచ్చుకులగుంట క్రీడా మైదానంలో జరుగుతున్న కోచింగ్ క్యాంపు బుధవారంతో ముగిసింది.

సుమారు 120 మంది చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ముగింపు కార్యక్రమంలో జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్షులు ఎంఎస్‌పీవీ రమణమూర్తి (పప్పి) మాట్లాడుతూ ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అద్భుతమైన క్రీడా ప్రాంగణం, కోచ్, జిమ్, టర్ఫ్ వికెట్స్ తయారయ్యాయన్నారు. దీని కారణంగా పిల్లలు ఉత్సాహంగా కోచింగ్ పాల్గొన్నారని తెలిపారు. జిల్లా కార్యదర్శి దాసరి రమేష్ కుమార్ మాట్లాడుతూ పిల్లలందరికీ పార్టిసిపేషన్ సర్టిఫికేట్లు అందజేసామన్నారు. శిక్షణ శిబిరం కొనసాగుతుందన్నారు. పిల్లలు క్రమం తప్పకుండా సాధన చేస్తే మంచి భవిష్యత్ ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం రంజీ క్రికెటర్ రషీద్, ఇటీవల సివిల్స్‌లో ర్యాంకు సాధించిన అశ్విన్ మణిదీప్‌లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆడిటర్ శివరామ్, ఎం.ప్రణవ్, అయితి సతీష్, రామకృష్ణ పరమహంస, శ్రీధర్, పురుషోత్తమ్, శరత్, క్రికెటర్స్ పాల్గొన్నారు. శిక్షణ పొందిన వారు ఏమన్నారంటే...


క్రికెట్ శిక్షణ ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న రమణమూర్తి

రాష్ట్ర పోటీలకు ఉపయోగపడుతుంది



ఇప్పటికే నేను అండర్-14 స్టేట్ ఆడా. అండర్-16 స్టేట్‌కు సన్నద్ధమవుతున్నా. ఈ నెల రోజులు శిక్షణలో కోచ్‌తోపాటు ప్రముఖ క్రికెటర్లు వచ్చి మెలకువలు నేర్పించారు. వికెట్ కీపింగ్‌లో ఫాస్ట్ మూవింగ్ సాధన చేసా. దీనివల్ల ఎంతటి ఫాస్ట్ బాల్, గుగ్లీ వచ్చినా సులభంగా పట్టుకోవచ్చు. బ్యాటింగ్‌లోనూ ఫాస్ట్ బాల్‌ను ఆన్‌డ్రైవ్ చేయడం బాగా నేర్చుకున్నా. ఈ శిక్షణ చాలా ఉపయోగపడింది. –జి.దేవ్ ప్రమోద్, వికెట్ కీపర్,

మణికట్టులోనే మాయ



నేను బ్యాటింగ్‌తోపాటు లెగ్ స్పిన్ బౌలింగ్ వేస్తా. ముఖ్యంగా లెగ్ స్పిన్నర్స్‌కు గుగ్లీ చాలా ఉపయోగం. మణికట్టును మర్మంగా తిప్పుతూ గుగ్లీ వేస్తే వికెట్ తప్పకుండా వస్తుంది. ఆ టెక్నిక్ ఇక్కడ నేర్చుకున్నా. అండర్-19 స్టేట్ ఆడడమే ధ్యేయంగా పెట్టుకున్నా. ఈ శిక్షణ శిబిరం ముగిసినా కూడా ఇక్కడే సాధన చేస్తా. ఉచితంగా అద్భుతమైన శిక్షణనిస్తున్నారు. థ్యాంక్స్ ఏసీఏ, జీడీసీసీ.

–డి.రోనీ అమోల్, ఆల్‌రౌండర్.

పిల్లల భవిష్యత్ తల్లిదండ్రుల చేతుల్లో..



శిక్షణ శిబిరం నెల రోజులు పిల్లలు ఎంతో సంతోషంగా గడిపారు. ఇక్కడ కేవలం క్రికెట్ శిక్షణే కాకుండా ఫిట్‌నెస్ మీదా దృష్టి సారించాం. మీ పిల్లలకు ఏది నచ్చితే ఆ క్రీడలో సాధన చేయించండి. వారిలో క్రీడా స్ఫూర్తి, పోటీతత్వం, క్లిష్ట సమయాల్లో ఎలా వ్యవహరించాలో తెలుస్తుంది. ఇక్కడ శిక్షణ కొనసాగుతుంటుంది. కావాలంటే పిల్లల్ని పంపవచ్చు.

– ఇండ్ల భాస్కర్, జీడీసీసీ క్రికెట్ కోచ్.

నేడు అండర్-19 బాలబాలికల చెస్ పోటీలు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): జిల్లా చెస్ సంఘం ఆధ్వర్యంలో అండర్-19 బాల బాలికల చెస్ పోటీలు నిర్వహిస్తామని జిల్లా అధ్యక్షులు సి.హెచ్. రవీంద్రరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 9 గంటలకు స్థానిక రాజేంద్ర నగర్‌లో 3వ లైన్లోని విజన్ జూనియర్ కాలేజీలో జరుగుతాయన్నారు. క్రీడాకారులు ఉదయం 8 గంటలకల్లా రావాలన్నారు. ఆధార్‌తోపాటు జనన ధృవీకరణ పత్రంతో రావాలన్నారు. ప్రతిభకనబరచిన వారిని రాష్ట్ర పోటీలకు పంపిస్తామని చెప్పారు. మరిన్ని వివరాలకు 79816 64035 నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

వ్యవసాయ రంగం బలోపేతానికి కృషి

వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ

ప్రత్తిపాడు: వ్యవసాయరంగాన్ని మరింత బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకోవాలని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఎ.విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. గుంటూరు రూరల్ మండల పరిధిలోని లాం ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఉపకులపతి విష్ణువర్ధన్ రెడ్డి అధ్యక్షతన యూనివర్సిటీ అధికారులు, విస్తరణ విభాగాల అధిపతులు, నాబార్డు అధికారులతో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశంలో రైతులను సంఘటిత పరచడం, వాతావరణ, మార్కెట్ ధరల మధ్య నష్టపోతున్న వ్యవసాయ రంగాన్ని స్థిరీకరించేందుకు చేపట్టవలసిన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ ఎప్పటికప్పుడు మారుతున్న వాతావరణ పరిస్థితుల్లో మిర్చి పంటను ఆశిస్తున్న నల్ల తామర, మొక్కజొన్నలో కత్తెర పురుగు, పత్తిలో గులాబీరంగు పురుగుల నియంత్రణకు తీసుకోవలసిన చర్యలపై విస్తరణ విభాగం ఎప్పటికప్పుడు రైతాంగాన్ని అప్రమత్తం చేస్తూ ఉత్తమ సేవలు అందిస్తుందన్నారు. అదేవిధంగా రైతులను సంఘటిత పరిచి విలువ నాబార్డు చీఫ్ జనరల్ మేనేజర్ ఎంఆర్ గోపాల్ మాట్లాడుతూ విస్తరణ విభాగం చేపట్టే కార్యక్రమాల్లో భాగస్వాములు అయ్యేందుకే మొదటిసారి విశ్వవిద్యాలయానికి వచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో పరిశోధనా సంచాలకులు డాక్టర్ ఎల్.ప్రశాంతి, విస్తరణ సంచాలకులు డాక్టర్ ఎ.సుబ్బరామిరెడ్డి, నాబార్డు డీజీఎం అభువరాజన్, ఏజీఎం మిలింద్ చౌలస్కర్ తదితరులు పాల్గొన్నారు.

హజ్ యాత్రికుల బసకు ఏర్పాట్లు

- రాష్ట్రం నుంచి హజ్ యాత్రకు 1790 మంది
- మదరసాలో ఏర్పాట్లను పరిశీలించిన డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా, వక్ఫ్‌బోర్డు అధికారులు


బస వసతి ఏర్పాట్లను పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా

పెదకాకాని: పవిత్ర హజ్‌యాత్రకు వెళ్లే వారు తొలిసారిగా గన్నవరం ఎయిర్‌పోర్టులో ఏర్పాటు చేసిన ఎంబార్కేషన్ పాయింట్ నుంచి బయలు దేరుతారని రాష్ట్ర డిప్యూటీ సీఎం, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి అంజాద్‌బాషా అన్నారు. గుంటూరు జిల్లా పెదకాకాని మండలం, నంబూరు మదరసా ఏ సిరాజుల్ ఉలూమ్‌లోని హజ్ యాత్రికులు బస చేసేందుకు జరుగుతున్న ఏర్పాట్లను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు హజ్ యాత్రికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పూర్తిస్థాయిలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. గన్నవరం ఎంబార్కేషన్ పాయింట్ నుంచి 1790 మంది హాజీలు పవిత్ర హజ్ యాత్రకు బయలు దేరి వెళుతున్నారన్నారు. మదరసా ఏ సిరాజుల్ ఉలూమ్‌లో ఏర్పాటు చేసిన హజ్ క్యాంపునకు 24 గంటలు ముందుగా హాజీలు రిపోర్టు చేసి లగేజీ హ్యాండోవర్ చేయాల్సి ఉంటుందన్నారు. ఎయిర్‌పోర్ట్ అధికారుల సూచనల మేరకు హజ్ యాత్రికుల లగేజీ కోసం స్ట్రాంగ్‌రూం, లగేజీ స్కానింగ్ మిషన్‌రూం, ఏర్పాటు పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. గన్నవరం నుంచి జూన్ నెల 7వ తేదీన 170 మంది యాత్రికులతో జిద్దాకు ఒక విమానం వెళుతుందన్నారు. వారందరికీ ఇక్కడ వసతులు కల్పించడం జరిగిందని వారితో పాటు వచ్చే బంధువులకు హజ్ క్యాంప్ వెలుపల వసతి సౌకర్యం కలిగించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. భోజనాలకు సంబంధించి అన్ని పనులు కాంట్రాక్ట్ పద్ధతిలో అప్పగించడం జరిగిందని, పనులు వేగవంతంగా జరుగుతున్నాయని వివరించారు. మదరసాను సందర్శించిన వారిలో వక్ఫ్‌బోర్డు సీఈఓ ఖాదర్‌వలి, హజ్ కమిటీ చైర్మన్ గౌసమ్‌అజామ్, రాష్ట్ర మైనార్టీ వ్యవహారాల సలహాదారుడు ఎస్ఎం జియావుద్దీన్, హజ్ కమిటీ డైరెక్టర్ బాసిత్, గుంటూరు నగర డిప్యూటీ మేయర్ షేక్ సజల, డాక్టర్ అయూబ్‌హుస్సేన్ పాల్గొన్నారు.


కారు డ్రైవర్‌కు దేహశుద్ధి


ప్రమాదంలో దెబ్బతిన్న కారు ముందుబాగం (ఇన్‌సెట్) కారు డ్రైవర్

చేబ్రోలు: మద్యం మత్తులో కారు నడిపిన డ్రైవరుకు స్థానికులు దేహశుద్ధి చేసిన ఘటన వడ్లమూడిలో బుధవారం చోటుచేసుకుంది. ఈ ఘటనలో రెండు ఆటోలు, నాలుగు బైక్‌లు, రోడ్డు పక్కన వెళ్తున్నవారిని ఢీ కొట్టడంతో ఆరుగురికి గాయాలైనాయి. నారాకోడూరు గ్రామానికి చెందిన సుమన్ తెనాలి నుంచి నారాకోడూరు వైపునకు కారులో వస్తూ సంగం జాగర్లమూడి సమీపంలో ఓ బైక్‌ను ఢీ కొట్టాడు. ఆపకుండా అతివేగంగా నడుపుతూ వడ్లమూడి గరువుపాలెం వంతెన వద్ద ఆటోను ఢీ కొట్టాడు. మరి కొంతదూరం వచ్చిన తరువాత అడ్డదిడ్డంగా డ్రైవింగ్ చేస్తూ రోడ్డు పక్కను వెళ్తున్న వారిని, ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాలను ఢీ కొట్టాడు. వడ్లమూడి గౌడపాలెం ప్రభుత్వ పాఠశాల వద్ద గోడను ఢీ కొట్టి కారు నిలిచిపోవడంతో కారు డ్రైవర్‌ను స్థానికులు పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పచెప్పారు. మద్యం మత్తులో కారును నడపటమే కారణంగా భావిస్తున్నారు.

రేపు గుంటూరులో ట్రాఫిక్ మళ్లింపు

- ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా...
- వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ ఆరీఫ్ హఫీజ్



లక్ష్మీపురం: ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి 2న గుంటూరులోని చుట్టుగుంట సెంటర్‌లో జరిగే సమావేశానికి విచ్చేస్తున్న సందర్భంగా శుక్రవారం ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు నగరంలో ట్రాఫిక్ మళ్లిస్తున్నట్లు ఎస్పీ ఆరీఫ్ హఫీజ్ బుధవారం వెల్లడించారు. నగరంలోని చుట్టు పక్కల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు, అసౌకర్యానికి గురవ్వకుండా ట్రాఫిక్ క్రమబద్ధీకరించామని వెల్లడించారు.

- ప్రధానంగా చిలకలూరిపేట వైపు నుంచి గుంటూరు నగరంలోని ప్రవేశించే ఆర్.టి.సి వాహనాలు, బుడంపాడు జంక్షన్ నుంచి పొన్నూరు రోడ్డు మీదుగా ఆర్.టి.సీ బస్‌స్టాండ్‌కు వెళ్లాల్సి ఉంటుందని తెలిపారు.
- అలాగే గుంటూరు నగరం నుంచి చిలకలూరి పేట వెళ్లే వాహనాలు మార్కెట్ పేరేచర్ల బస్టాండ్, ఎత్తు రోడ్డు మీదుగా ఏటుకూరు బైపాస్ జంక్షన్ రోడ్డు వైపుగా ప్రయాణించాల్సిందిగా సూచించారు.
- నరసరావుపేట, సత్తెనపల్లి, నుంచి గుంటూరు నగరంలోకి వచ్చే వాహనాలు ఆర్టీసీ బస్సులు, గూడ్స్ వెహికల్స్, దూర ప్రాంతాలకు వెళ్లే పెద్ద వాహనాలు నల్లపాడు జంక్షన్‌నుంచి అంకిరెడ్డిపాలెం వైపుగా జాతీయ రహదారి వైపు వెళ్లాల్సి ఉంటుందన్నారు. ఆర్టీసీ బస్‌లు బుడంపాడు జంక్షన్ రోడ్డు నుంచి పొన్నూరు రోడ్డు మీదుగా గుంటూరు ఆర్టీసీ బస్‌స్టాండ్‌కు చేరాల్సి ఉంటుందన్నారు.
- ఆర్టీసీ బస్టాండ్ నుంచి సత్తెనపల్లి నరసారావుపేట వెళ్లవల్సిన వాహనాలు హిందూ కళాశాల సెంటర్, కలెక్టర్ ఆఫీస్ రోడ్డు, పట్టాభిపురం మీదుగా వెళ్లి, పలకలూరు రోడ్డు ద్వారా పేరేచర్ల జంక్షన్ వైపుగా వెళ్లాల్సిందిగా తెలియజేశారు.
- అదే విధంగా పేరేచర్ల వైపు నుంచి గుంటూరు నగరంలోకి ప్రవేశించే కార్లు, ద్విచక్రవాహనాలు చుట్టుగుంట రైతు బజార్ వరకు వచ్చి అక్కడి నుంచి ఏటి అగ్రహారం మెయిన్ రోడ్డు ద్వారా కలెక్టరేట్ రోడ్డు వైపుగా ప్రయాణించాల్సిందిగా తెలిపారు.
- గుంటూరు జిల్లా పరిషత్ రోడ్డు, గుంటూరు కన్వెన్షన్ హాల్ నుంచి చుట్టుగుంట వరకు, లాల్‌పురం జంక్షన్ నుంచి చుట్టుగుంట వరకు చిలకలూరిపేట వై జంక్షన్ నుంచి చుట్టుగుంట వరకు ఎలాంటి వాహనాలు అనుమతి లేదని చెప్పారు.

సీఎం పర్యటనకు పటిష్ట బందోబస్తు


బందోబస్తుపై పోలీస్ అధికారులకు సూచనలు చేస్తున్న జిల్లా ఎస్పీ ఆరిఫ్‌హఫీజ్

నగరంపాలెం: ఈనెల 2న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గుంటూరు నగర పర్యటన దృష్ట్యా పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్ తెలిపారు. సీఎం పర్యటన దృష్ట్యా నగరంపాలెంలోని జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలోని స్పందన హాల్‌లో బుధవారం సమీక్ష సమావేశం జరిగింది. అనంతరం పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో ఆయన పర్యటించారు. ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ పెరేడ్‌గ్రౌండ్‌లో హెలిప్యాడ్ చుట్టు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని అన్నారు. సరిపడా పోలీస్ సిబ్బందితో పహారా నిర్వహించాలని ఆదేశించారు. హెలీప్యాడ్ నుంచి చుట్టుగుంట సర్కిల్ వెళ్లే మార్గంలో ఇరువైపులా భద్రతా బలగాలతో అణువణువు గాలిస్తూ, ముమ్మరంగా తనిఖీలు చేపట్టాలని అన్నారు. ప్రత్యేక బలగాలతో హెలీప్యాడ్, చుట్టుగుంట సర్కిల్ వద్ద జరగనున్న సభ పరిసర ప్రదేశాలలో కూంబింగ్ నిర్వహించాలన్నారు. అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా జాగ్రత్తగా ఉండాలని అన్నారు. సభ ప్రారంభం నుంచి ముగిసే వరకు పోలీస్ అధికారులు, సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏ ఒక్కరూ విధుల్లో అలసత్వం ప్రదర్శించవద్దని అన్నారు. సమావేశంలో ఏఎస్పీలు ఎన్.షెల్కే (గుంటూరు తూర్పు), కె.సుప్రజ (పరిపాలన), కె. శ్రీనివాసరావు (ఎల్అండ్ఓ), శ్రీనివాసరావు (క్రైం), కె.కోటేశ్వరరావు (ఏఆర్), డీఎస్పీలు పోతురాజు, బాలసుందరరావు, సుభాష్, ఉమామహేశ్వరరెడ్డి, జనార్ధన్‌రావు, కేసీహెచ్ రామారావు, శ్రీనివాసరావు, ఎస్‌బీ, డీసీఆర్‌బీ సీఐలు నరసింహారావు, శ్రీనివాసరావు, బాల సుబ్రహ్మణ్యం, నగరంపాలెం పీఎస్ సీఐ హైమారావు, ఆర్ఐలు పాల్గొన్నారు.

వివేకానందరెడ్డి హత్యలో అవినాష్ రెడ్డి ప్రమేయం లేదు

గుంటూరులో మీడియాతో మాట్లాడిన రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి

గుంటూరు ఎడ్యుకేషన్: వివేకానందరెడ్డి హత్యతో ఎంపీ అవినాష్‌రెడ్డికి ప్రమేయం ఉండే అవకాశం లేదని రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి అన్నారు. బుధవారం ఆయన గుంటూరులో మీడియతో మాట్లాడుతూ ఎంపీ అవినాష్‌రెడ్డి తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకుంటారని అభిప్రాయపడ్డారు. రాజకీయాల్లో ఒక హద్దు అనేది ఉంటుందని, రాష్ట్రంలో ప్రతిపక్షాలు ప్రతి అంశాన్ని కావాలనే రాద్ధాంతం చేస్తున్నాయని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో ఎలాగైనా సరే అధికారంలోకి రావాలనే దుర్బుద్ధితో టీడీపీ జిమ్మిక్కులు చేస్తూ ఆచరణ సాధ్యం కాని మేనిఫెస్టో విడుదల చేస్తోందని, ఎవరెన్ని మేనిఫెస్టోలు పెట్టినప్పటికీ వచ్చే 30 ఏళ్ల రాష్ట్ర భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని సీఎం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని పేర్కొన్నారు.